క్లుప్తంగా

శిల్పారామం కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : శిల్పారామంలో పని చేసే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌సీపీ బృందం శిల్పారామంలో పర్యటించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. రవి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, సిబ్బంది కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. శిల్పారామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగినంత మంది సిబ్బంది లేరన్నారు. కార్మికులందరికీ సమాన హక్కులు కల్పించి సమాన వేతనాన్ని అందించాలని ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం బాధ్యులు మునిరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీమ్ పాల్గొన్నారు.

ఆర్జేడీకి అభినందన



ఆర్జేడీని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన కాగిత శామ్యూల్‌ను పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకట శివారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మీకాంత్‌లు మంగళవారం ఆర్జేడీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆర్జేడీ దృష్టికి పలు ఉపాధ్యాయ సమస్యలను తీసుకెళ్లారు.

‘బ్రౌన్’కు పోటీ పరీక్షల పుస్తకాలు



పుస్తకాలను అందజేస్తున్న దాతలు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి మరికొన్ని పుస్తకాలు చేరాయి. కడప నగరానికి చెందిన లింగాల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మేనకోడలు సింగిరెడ్డి శ్రీలక్ష్మి, అమిరెడ్డి సుధాకర్‌రెడ్డి దంపతులు రూ. 9 వేల విలువైన పోటీ పరీక్షల నూతన పుస్తకాలను అందజేశారు. మంగళవారం గ్రంథాలయం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డిని తమ కుమారుడు వంశీకృష్ణతో కలిసి ఇతర 50 పుస్తకాలను కూడా అందజేశారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు రమేష్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, కథా రచయిత వేంపల్లె షరీఫ్, తెలుగు ఉపన్యాసకులు కైపా కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి



మాట్లాడుతున్న మనోహర్

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్‌ను ధరించి ప్రమాదాలను నివారించాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం రక్షిత హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సురక్షితంగా గమ్యాన్ని చేరాలంటే ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. విద్యార్థులు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఖచ్చితంగా హెల్మెట్‌ను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

చెన్నూరు : మండల అభివృద్ధి సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సభా భవనంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరవుతున్నారని మండల అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని శవాస్కన్‌పల్లె గ్రామంలో టీడీపీ నాయకులు దాడిచేసిన సంఘటనలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మంగళవారం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు చేసే దాడులకు అధైర్యపడవద్దు. పార్టీ, నేను మీకు అండగా ఉంటామని వారి భరోసా కల్పించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బాలికా.. యువ సైనిక

- కేజీబీవీల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీలు, 3 మోడల్ స్కూల్స్
- ప్రాధాన్యత క్రమంలో కేటాయింపులు



ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : విద్యార్థిదశ నుంచే విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించడమే ధ్యేయంగా ఏర్పాటైన నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) సేవలు విస్తరించనున్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు దేశవ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది నూతన ఎన్‌సీసీ కేడెట్స్ నియామకాల ప్రక్రియ చేపట్టాలని మార్గదర్శకాలు జారీ చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన 42 పాఠశాలలు, 3 మోడల్ స్కూల్స్‌లో సైతం ఎన్‌సీసీ యూనిట్లు ప్రాధాన్యత క్రమంలో ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

తాజాగా సమగ్రశిక్షా అభియాన్ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఎన్‌సీసీ ప్రారంభించి ప్రవేశాలు చేపట్టాలని సమగ్రశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా జిల్లా వ్యాప్తంగా 30 ఆంధ్రా బెటాలియన్ పరిధిలో జూనియర్ డివిజన్ ఎన్‌సీసీ యూనిట్లు 13 ఉండగా, కేజీబీవీల్లో సైతం ఎన్‌సీసీ ప్రారంభిస్తే మరింత విస్తరించే అవకాశం కలుగుతుంది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు ఉండగా, జిల్లా విద్యాశాఖాధికారి/సమగ్రశిక్షా అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు సమీపంలోని ఎన్‌సీసీ బెటాలియన్‌లో సంబంధిత ఎన్‌సీసీ అధికారులను కలిసి కేజీబీవీల్లో ప్రాధాన్యత క్రమంలో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేసి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరే అవకాశం లభించనుంది.

ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుపై నిర్ణయం హర్షణీయం..



రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి కేజీబీవీలు, పీఎంశ్రీ స్కూల్స్‌లో ఎన్‌సీసీ యూనిట్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీచేయడం హర్షణీయం. తద్వారా ఎన్‌సీసీలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

- పి.వి. సుబ్బారెడ్డి, ఏపీ ఎన్‌సీసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

కేజీబీవీల్లో ఎన్‌సీసీ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం..



సమగ్రశిక్షా అభియాన్ ఎస్పీడీ ఆదేశాల మేరకు జిల్లాలోని కేజీబీవీల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించి సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఎన్‌సీసీ అధికారులను కలిసి యూనిట్లు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- ఎం. అనూరాధ, డీఈఓ, వైఎస్సార్ కడప జిల్లా

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో ఆర్టీసీ అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదని, ఈ విషయంగా మీరు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు కోరారు.

మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలో ఆరు డిపోలు ఉంటే ఐదు డిపోలకు అలవెన్సులు కలుపుతున్నారని, కడప డిపో ఉద్యోగులకు మాత్రం అలవెన్సులు కలుపడం లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కడప డిపోలో కండక్టర్ల చార్జులు వేసి డ్రైవర్ల చార్జు వేయకుండా డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బెంగుళూరు పాయింట్‌లో బస్సులకు పార్కింగ్ ప్రదేశం లేనందువల్ల డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఉద్యోగులకు ఇవ్వాల్సిన 6, 12, 18, 24, 30 సంవత్సరాల ఇంక్రిమెంట్లు సకాలంలో కలపడం లేదన్నారు. మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు ఇవ్వడం లేదని తెలిపారు. ఇంకా అనేక సమస్యలను డీపీటీఓ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఈ విషయంగా తగిన చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు.

కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : నూతనంగా ఏర్పాటైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం కడపకు వచ్చేసిన రవాణశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎస్‌బిఐబి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు మాట్లాడుతూ కడప ఉక్కును నిర్మించడం వల్ల వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు ఆందోళనలు

బద్వేలు అర్బన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల తహసీల్దారు కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాయడం దుర్మార్గమన్నారు. ఆందోళనలలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉచిత ఇసుక విధానాలపై అవగాహన

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఉచిత ఇసుక విధానాలపై వేంపల్లె తహసీల్దార్ వెంకటేష్, సీఐ చాంద్‌బాషాలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభాభవనంలో ట్రాక్టర్ యజమానులు, రైతులకు వారు నూతన మార్గదర్శకాలను వివరించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా, నిర్వహణ ఛార్జీలు మాత్రమే వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ట్రాన్సిస్ట్ ఫారంలో వివరాలతో తమ ఆధార్‌కార్డు నెంబరు నమోదు చేసి బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 11 స్టాక్ పాయింట్లు ఉండగా.. వేంపల్లెకు సమీపంలోని వీరపునాయునిపల్లె, పులివెందులలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించి స్టాక్ పాయింట్ల నుంచే ఇసుకను తోలుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎద్దుల బండ్లకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి సోమశేఖర్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోకేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గోపవరం : వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని సాయికృష్ణ ట్రేడర్స్, పి.సి.ఎస్.ఆగ్రో ఏజెన్సీస్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను రాష్ట్ర వ్యవసాయ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ గడువు, స్టాకు రిజిస్టర్లలో నిల్వలు, గోడౌన్‌లో నిల్వలు పరిశీలించారు. రసీదు పుస్తకం, ఇన్‌వాయిస్, వేబిల్స్ అన్నీ కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. చట్టబద్ధ వ్యాపారం చేయాలని, ఎప్పటికప్పుడు ధరల స్టాకుబోర్డు వివరాలు ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతుల పూర్తి చిరునామా, మొబైల్ నెంబర్, సంతకాలు, వేలిముద్రలు సేకరించాలన్నారు. కాగా విజిలెన్స్ అధికారులు తనిఖీలకు వస్తున్నట్లు తెలియడంతో కొందరు డీలర్లు దుకాణాలను మూసివేశారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ఎం.ఈ.ప్రసాద్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి.ఈదురు బాషా, బద్వేలు ఏడీఏ ఎం.నాగరాజ, వ్యవసాయాధికారి జి.రామకృష్ణయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

‘విశ్వ కర్మ యోజన’ సద్వినియోగం చేసుకోవాలి



కార్మికులతో అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశ్వ కర్మ యోజన (పథకం) ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని విశ్వ కర్మ యోజన పథకం మేనేజర్ అంజూ తెలిపారు. మంగళవారం కడప నగరంలో శిక్షణ పొందిన చేతి వృత్తిదారులను కలిసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను మేనేజర్ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వ కర్మ పథకానికి 18 రకాల చేతి వృత్తిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ పథకానికి దరఖాస్తులు చేసుకొన్న వారికి ఆయా వృత్తులకు సంబంధించి 6 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ పొందిన వారికి స్టయిఫండ్ కింద రూ. 4 వేలు ఇస్తామన్నారు. వేంపల్లెలో 150 మంది కార్మికులు శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకొన్న నెల రోజులకు రూ.15 వేలు విలువ చేసే పనిముట్లు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. అలాగే ఉపాధి కోసం లక్ష రూపాయల రుణాన్ని ఇస్తుందన్నారు. ఈ రుణానికి 5 శాతం వడ్డీ కట్టాల్సి వస్తుందని చెప్పారు. ఈ శిక్షణ శిబిరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ట్రైనర్స్ హరినాథ్ రెడ్డి, శిరీషా, కార్మికులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్ రద్దు చేయండి

డీఆర్‌ఓకు ఫ్యాప్టో వినతి



డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే కారణంగా ఖాజీపేట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాదేవి పై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) డీఆర్‌ఓకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయ కుమార్, సెక్రటరీ జనరల్ ఎస్.మొహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఖాజీపేట పాఠశాలలోని వాటర్ ట్యాంక్ నీటిని పలువురు విద్యార్థులు తాగినప్పటికీ కేవలం ముగ్గురు, నలుగురు విద్యార్థులు మాత్రమే అస్వస్థతకు లోనయ్యారన్నారు. వర్షాకాలం ప్రారంభమై కొన్ని ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, అందులో భాగంగానే డయేరియా కారణంగా కొంత మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. ఈ సంఘటనకు ప్రధానోపాధ్యాయురాలని బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి, ప్రధానోపాధ్యాయురాలిపై విధించిన సస్పెన్షన్ ను రద్దు చేయించడంతో పాటు, పాఠశాలలకు ప్రభుత్వం నుండి రావలసిన మెయింటెనెన్స్ గ్రాంట్ ను విడుదల చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.ఇలియాస్ బాష, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.బాలగంగి రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.ఖాదర్ బాష, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అబ్దుల్లా, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటలో మెళకువలు పాటించాలి



మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కలసపాడు : మినుము పంటలో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ తెలిపారు.

మంగళవారం మండలంలోని రైతులు సాగు చేసిన మినుము పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడినందున మినుము పంటలో పురుగులు తెగుళ్ళు సోకే అవకాశం ఉందన్నారు. లేత దశలో ఆకులు ఉన్నప్పుడు చిత్తపురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయని, పేనుబంక మినుములో కాండంపై, పూతపై ఒక పొరలా ఏర్పడి రసం పీలిస్తుంటాయని తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పంటకు పల్లాకు తెగులు సోకినప్పుడు మొక్కల ఆకులు పసుపురంగులోకి మారతాయని, ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు ఎసీటమాప్రిడ్ 0.5 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు లేదా డైఫెన్థియురాన్ 0.5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు.


‘వారాహి’గా శ్రీ బాలపోలేరమ్మకు నవరాత్రులు



విశేష అలంకారంలో బాల పోలేరమ్మ తల్లి

కడప కల్చరల్ : కడప నగరం చిన్నబెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ మాతకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వారాహి దేవిగా అలంకరించారు. వారం రోజులపాటు దేవీ నవరాత్రి పూజలు వారాహి అలంకారంలోనే నిర్వహించనున్నారు. జిల్లాలో తొలిసారిగా ఈ అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహించడం విశేషం. ఇందులో భాగంగా మంగళవారం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి లలిత సహస్ర నామ పారాయణాన్ని సామూహికంగా నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేసి తమ కోరికలు నెరవేరాలని మొక్కుకున్నారు. కాగా ఈనెల 21న ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన 108 కలశాల నీటితో అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు తెలిపారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పీఎఫ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి



మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్మిక నాయకులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పీఎఫ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి పేర్కొన్నారు. మంగళవారం కార్మికులు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్ విషయంలో 7, 8 సంవత్సరాలుగా పుట్టిన తేది, తండ్రి పేరు ఇతరత్రా తప్పులు దొర్లిన వారు అవి మార్చుకోవడానికి వీలుగాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తప్పులు సరిదిద్దడానికి పీఎఫ్ కార్యాలయంలో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటుచేసి ఉన్నారని, ఆయనకు ఇచ్చినప్పటికీ లోపాలు సవరణ కాలేదన్నారు. పీఎఫ్ కార్యాలయంలో అసలు అధికారుల తీరు చాలా నిర్లక్ష్యంగా ఉందన్నారు. నగరపాలక కమిషనర్ జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పుల్లయ్య, చిన్నస్వామి పాల్గొన్నారు.

ఘనంగా రజక ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న రజక ఐక్యవేదిక నాయకులు

కడప కార్పొరేషన్ : జిల్లా రజకుల ఐక్యవేదిక ఆత్మీయ సమావేశం పాలతలలోని బండెన్న స్వామి సన్నిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు ఆ వేదిక అధ్యక్షుడు టి. నాగేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఓ. కేశవయ్య, ఉపాధ్యక్షులు గంగులయ్య, ఎల్. సుబ్బరాయుడు. పెద్దరోశన్నలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశంలో జిల్లా నలుమూలల నుంచి రజక సోదరులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు. రజకుల సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఎంపీటీసీ జి. వెంకటేష్, పి. సుబ్బరాయుడు, పి. కొండయ్య, మఠం అన్నదాన సత్రం సభ్యులు సింగపూర్ సుబ్బరాయుడు, నిత్యపూజయ్య, నరసింహులు, రోశన్న, ఎం. వెంకటేష్, డి. సుబ్బరాయుడు. రమేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు పిలుపునిచ్చారు. కడప నగరంలో మంగళవారం జీవీ రఘునాథ్ సహకారంతో జీవీ శ్రీకర్, టి.ఉదయభాస్కర్ విద్యార్థులకు 100 పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పేద విద్యార్థులను తనవంతుగా ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా.. డ్రైవర్ మృతి



మృతిచెందిన గంగాధర్



అదుపు తప్పి బోల్తా పడ్డ ముగ్గురాయి టిప్పర్

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని గుర్రాలచింతలపల్లె వద్ద మంగళవారం రాత్రి అదుపు తప్పి మిని టిప్పర్ బోల్తా పడ్డ సంఘటనలో వేముల గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ గంగాధర్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వేముల నుండి ముగ్గురాయి లోడ్‌లో కడపకు వెలుతున్న మినిటిప్పర్ గుర్రాలచింతలపల్లె వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గంగాధర్ టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని కడప రూరల్ సీఐ నాగరాజు పరిశీలించి క్యాబిన్‌లో ఇరుక్కపోయిన మృతదేహాన్ని బయటకు తీయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.